
రేపటి నుంచి సంకిలి సుగర్స్‌లో క్రషింగ్

● మెట్రిక్ టన్ను చెరకు ధర రూ.3360లు

రేగిడి, డిసెంబరు 3,(ఆంధ్రజ్యోతి): సంకిలి ఈఐడీ ప్యారీ సుగర్స్ కర్మాగారంలో క్రషింగ్ సీజన్ ఈ నెల 5నుంచి ప్రారంభం కానుంది. మెట్రిక్ టన్ను చెరకు ధర రూ.3360లుగా యాజమాన్యం ప్రకటించింది. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గత సంవత్సరం కంటే టన్నుకు రూ.209 అధికంగా ఇస్తున్నట్లు వెల్లడించింది. గత ఏడాది ప్రకటించిన ప్రోత్సాహకాలు క్రషింగ్ అయ్యాక అందిస్తామని, రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

మరోసారి తెరపైకి..

● ఉపాధ్యాయుల గ్రేడింగ్ దిశగా ప్రభుత్వ అడుగులు
● విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ప్రత్యేక విధానం
● క్షేత్రస్థాయిలో కేపీఐ సర్వే ● నాడు కౌన్సెలింగ్ సమయంలో అమలు
● నేడు మరింత వినూత్నంగా తేవాలని ఆలోచన
● ఉపాధ్యాయుల నుంచి మిశ్రమ స్పందన



ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల గ్రేడింగ్ విధానం మరోసారి తెరపైకి వచ్చింది. అటుగా ప్రభుత్వం దృష్టిసారించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా గ్రేడింగ్ విధానం తీసుకురాగా అప్పట్లో కేవలం బదిలీల సమయంలోనే అమలు చేసింది. ప్రస్తుతం మరింత వినూత్నంగా తీసుకు రావాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై లోతుగా కసరత్తు జరుగుతోంది. ఈ అంశంపై ఉపాధ్యాయుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది.

బొబ్బిలి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి)

ఉపాధ్యాయుల బదిలీల కోసం 2017లో మొదటిగా అప్పటి ప్రభుత్వం గ్రేడింగ్ విధానాన్ని తీసుకొచ్చింది. ఎపెక్స్ యాప్‌లో నమోదైన వారికి, పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం తీసుకునే విద్యార్థుల సంఖ్య, విద్యార్థుల హాజరు, వారి ఉత్తీర్ణతా శాతం ప్రాతిపదికగా తీసుకొని ఉపాధ్యాయులకు గ్రేడింగ్ ఇచ్చారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు సాధించిన వారికి అదనంగా పాయింట్లు ఇచ్చారు. వీటిని ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్‌లో మాత్రమే వినియోగించారు. ప్రస్తుతం మరింత వినూత్నంగా ఉపాధ్యాయులకు గ్రేడింగ్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై కీ పెర్‌ఫార్మెన్స్ ఇండికేటర్స్ (కేపీఐ) ప్రక్రియ జరుగుతోంది. దాదాపు పూర్తయింది. ప్రతీ సబ్జెక్టులో విద్యార్థుల సగటు మార్కులను ప్రాతిపదికగా తీసుకొని ఈ గ్రేడింగ్ విధానాన్ని తీసుకొస్తున్నారు.

ప్రతి మండలంలో నాలుగు నుంచి ఆరు క్లస్టర్స్ ఉండగా ఒక డైట్ విద్యార్థి, క్లస్టర్ రీసోర్స్ మోనటరింగ్ టీచర్ (సీఆర్ఎంటీ) ఆధ్వర్యంలో ప్రతీ క్లస్టర్‌లో ఉపాధ్యాయుల పని విధానానికి సంబంధించి (మిగతా 8వ పేజీలో..)

బోధనకు ఇన్‌స్ట్రక్టర్లు

● 5 నెలల కాలానికి నియామకం
● ఈ నెల 7 వరకూ దరఖాస్తుల ఆహ్వానం
● 9వ తేదీ నుంచి విధులు
● ఉపాధ్యాయుల కొరత ఉన్న చోట భర్తీ

రాజాం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను అందుబాటులోకి తేనుంది. రాష్ట్రవ్యాప్తంగా 1146 పోస్టులను భర్తీ చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సబ్జెక్టు టీచర్లతో పాటు ఎస్‌జీటీలను సైతం నియమించనుంది. వారి వేతనాలను సైతం ఖరారు చేసింది. ఈ నెల 7లోగా దరఖాస్తు లివ్వాలని పేర్కొంది. ఈ అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లతో ఉపాధ్యాయుల కొరత తీరనుంది. గతంలో విద్యావలంటీరు పేరుతో తాత్కాలిక ఉపాధ్యాయుల నియామకం చేపట్టారు. ఈసారి అడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించనున్నారు.

మెగా డీఎస్సీలో భాగంగా ఇటీవల కొత్త ఉపాధ్యాయుల నియామకం చేపట్టారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి లాంగ్వేజ్ పండిట్స్ 45, స్కూల్ అసిస్టెంట్ 179, సెకెండరీ గ్రాడ్యుయేట్ టీచర్లు 149.. మొత్తం 373 పోస్టులు భర్తీ చేశారు. కానీ 583 వరకూ ఖాళీలు చూపించారు. ఇందులో 373 మాత్రమే భర్తీ చేయడంతో 210 వరకూ ఖాళీలు ఉన్నాయి. ఈ ఖాళీలు ఉన్నచోట, ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకొని కొత్తగా అడకమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించనున్నారు. ఈ విద్యా సంవత్సరంలో మిగిలిన 5 నెలలు మాత్రమే వీరు విధుల్లో ఉంటారు. మే 7 వరకూ కొనసాగనున్నారు. తాత్కాలిక ప్రాతిపదికన మాత్రమే వీరి నియామకం జరగనుంది. ఇందులో స్కూల్ అసిస్టెంట్లకు రూ.12,500, ఎస్‌జీటీలకు రూ.10 వేలు పారితోషికంగా అందిస్తారు. ఈ ఐదు నెలల కాలానికి పారితోషికాలకుగాను (మిగతా 8వ పేజీలో..)

వెంటనే దరఖాస్తు చేసుకోవాలి..

ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానంలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 5 నెలల కాలానికి మాత్రమే వీరు పనిచేయాల్సి ఉంటుంది. ఉత్తమ విద్యా బోధన అందించేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-యు.మాణిక్యంనాయుడు, డీఈవో, విజయనగరం

ఘంటసాల అభ్యున్నతికి ఇక్కడే పునాది

● విజయనగరం సంగీత కళాశాలలో చదువు
● నేడు ఆ మహాగాయకుని జయంతి





విజయనగరం కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శతాబ్ది గాయకుడు, పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు గురించి తెలియని తెలుగు వారుండరు. అందులోనూ ఆయన సంగీతాన్ని, గాత్రాన్ని అభిమానించే వారు దేశదేశాల్లోనూ ఉన్నారు. ఆ మహాగాయకుని అపూర్వ ప్రస్థానానికి విజయనగరం నుంచే అడుగులు పడ్డాయి. ఇక్కడి సంగీత కళాశాలలో 1936 నుంచి 1942 వరకూ సంగీతం నేర్చుకుని పట్టా అందుకున్నారు. గురువారం ఆయన జయంతి పురస్కరించుకుని ఘంటసాల స్మారక కళాపీఠం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్థానిక గుమ్చీ వద్ద ఉన్న ఘంటసాల విగ్రహానికి తొలుత పాలాభిషేకం చేయనున్నారు. అలాగే ఈ నెల 5న 12గంటల నిర్విరామ ఘంటసాల స్వరాభిషేకం కార్యక్రమం జరగనుంది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన పెర్కషన్ మాస్ట్రో పద్మశ్రీ శివమణి హాజరుకానున్నారు. ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో ఆయనకు సన్మానం జరగనుంది. ఏటా ఘంటసాల జయంతి, వర్ధంతి సభలను (మిగతా 8వ పేజీలో..)





ఇంకో చాన్స్

● పీఎం ఆవాస్ యోజన 2.0 దరఖాస్తు గడువు పెంపు ● ఈ నెల 14 వరకూ అవకాశం
● ఇదివరకే లబ్ధిపొందారంటూ కొన్ని తిరస్కరణ ● వారి పరిస్థితి తెలుసుకుంటున్న అధికారులు

రాజాం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల కోసం జిల్లాలో ఇప్పటివరకూ 26,302 మంది దరఖాస్తు చేసుకున్నారు. స్థలాల కోసం 1500 మంది దరఖాస్తు చేసుకున్నారు. గత ఏడాది డిమాండ్ సర్వేలో ఇళ్ల స్థలాల కోసం 6 వేల మంది, ఇళ్ల కోసం 39 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే దరఖాస్తులను మ్యాపింగ్ చేస్తున్న సమయంలో అనేకం తిరస్కరణకు గురవుతున్నాయి. గతంలో ప్రభుత్వం నుంచి ఇల్లు పొందినట్లు, బిల్లులు జమ అయినట్లు చూపుతున్నాయి. వారిలో అర్హులు ఉండడంతో ప్రభుత్వం మరో చాన్స్ ఇచ్చింది. 11 రోజుల గడువు లోపు అందరి దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే పూర్తి పారదర్శకంగా, ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకానికి ఇప్పటివరకు దరఖాస్తు చేయలేని వారికి, దరఖాస్తు తిరస్కరణకు గురైన వారికి ఉపశమనం. దరఖాస్తు గడువును ఈ నెల 14 వరకూ ప్రభుత్వం పొడిగించింది. వాస్తవానికి గత నెల 30తోనే గడువు ముగిసింది కానీ దరఖాస్తుదారుల విన్నపం మేరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.

● గత ప్రభుత్వాల హయాంలో గృహాలు మంజూరైన వారి దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి. ఇటువంటి వారు ప్రతిగ్రామంలో పదుల సంఖ్యలో (మిగతా 8వ పేజీలో..)

గడువు పెంపు

ఇళ్ల దరఖాస్తులకు సంబంధించి ప్రభుత్వం గడువు పెంచింది. ఈ నెల 14 వరకూ అవకాశం ఇచ్చింది. ప్రతి దరఖాస్తునూ ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించాం. ఏ దరఖాస్తునూ తిరస్కరించకుండా నమోదుచేయాలని సూచించాం. వీఆర్వోలతో పాటు సచివాలయ సిబ్బంది విధిగా నిబంధనలు పాటించి కార్యాలయంలో అందుబాటులో ఉండాలి.

- జి.మురళీమోహన్, గృహనిర్మాణ శాఖ అధికారి, విజయనగరం

ఎంఎస్ఎంఈ పార్కులో రూ.4 కోట్లతో సౌకర్యాలు



● ఏపీఐఐసీ డీజీఎం జైచంద్ర

రామభద్రపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో నెలకొల్పనున్న ఎంఎస్ఎంఈ పార్కులో రూ.4 కోట్లతో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నట్టు ఏపీఐఐసీ డీజీఎం కె.జైచంద్ర తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1.3 కిలోమీటర్ల రోడ్డు, డ్రెయిన్స్, కల్వర్టులు ఈ నిధులతో నిర్మించనున్నామని తెలిపారు. మొదటి విడతగా 20 ఎకరాల్లో ప్లాట్లు అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. సుమారు 139 ప్లాట్లు ఏర్పాటు చేయనున్నామని... ఒక్కొక్క ప్లాట్ 300 స్క్వేర్ మీటర్లుగా నిర్ణయించామని వెల్లడించారు. ఒక్కొక్క స్క్వేర్ మీటరు రూ.1112గా నిర్ణయించామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం రాయితీ ఇస్తామన్నారు. ఏపీఐఐసీడాట్.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో ప్లాట్లు బుక్ చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఏపీఐఐసీ జేఈ రాజేష్ పాల్గొన్నారు.

7లో

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

● లెఫ్టినెంట్ జనరల్ రవిశంకర్

పంట మార్పిడి పద్ధతులు పాటించాలి

● జేసీ సేతుమాధవన్

రేపటి నుంచి వైద్యుల సదస్సు

స్క్రబ్ టైఫస్‌పై ఆందోళన వద్దు

● అనుమానం ఉంటే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లండి
● కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అంచనాల ప్రకారం జిల్లాలో ఎటువంటి స్క్రబ్ టైఫస్ కేసులు నమోదు కాలేదని, ఇతర జిల్లాల్లో నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి సూచించారు. దీనిపై వైద్య అధికారులు, సిబ్బంది కూడా ప్రజలకు అవసరమైన సూచనలు ఇవ్వాలన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓరియాంటియా సుట్సుగామిషి అనే బాక్టీరియా వల్ల ఈ వ్యాధి కలుగుతుందని, పొదలు, పంట చేలు, గడ్డి మైదానాల్లో ఉండే సంక్రమిత చిగర్ మైట్స్ కాట్లు వేయడం ద్వారా వ్యాధి మనుషులకు సంక్రమిస్తుందని కలెక్టర్ తెలిపారు. అనుమానం ఉంటే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకుంటే సులభంగా బయపడవచ్చుని పేర్కొన్నారు. ఆకస్మికంగా అధిక జ్వరం, తలనొప్పి, శారీరక నొప్పులు, అలసట, శరీరంపై దద్దుర్లు కనిపించడం (మిగతా 8వ పేజీలో..)



రైతుకు అన్ని విధాలా మద్దతు

● కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

బొండపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతుకు అన్ని విధాలా మద్దతు కల్పించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి అన్నారు. రైతన్నా.. మీకోసం వారోత్సవాలను గొట్లాం రైతు సేవా కేంద్రంలో జిల్లా వ్యవసాయధికారి వి.తారకరామారావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక (మిగతా 8వ పేజీలో..)

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

● ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు ● సర్టిఫికెట్ల మంజూరులో ఆలస్యం చేయవద్దు ● కలెక్టర్ రామసుందర్‌రెడ్డి 7



పరిష్కరిస్తారో.. లేదో!

● నేడు జిల్లా సమీక్ష సమావేశం ● కీలక సమస్యలపై చర్చిస్తారని రైతుల ఆకాంక్ష
● హాజరుకానున్న ఇన్‌చార్జి మంత్రి అనిత, జిల్లా మంత్రి శ్రీనివాస్

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెవెన్యూ సమస్యలు అంతకంతకూ పెరుగుతుండడం... పీజీఆర్ఎస్‌లోనూ ఎక్కువ వినతులు వస్తుండడంతో కనీసం జిల్లా సమీక్ష సమావేశమైనా వీటికి పరిష్కారం చూపాలని, కీలకమైన నిర్ణయం తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత, జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో గురువారం జిల్లా సమీక్ష సమావేశం జరగనుంది. జిల్లా ప్రజలకు ఏఏ అంశాలలో మేలు చేస్తారో... ఎలాంటి సమస్యలపై చర్చిస్తారో చూడాలి.

జిల్లా ప్రజలను ప్రధానంగా రెవెన్యూ సమస్యలు వెంటాడుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, సాంకేతిక సమస్యలతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న (మిగతా 8వ పేజీలో..)

కుక్కల స్వైరవిహారం

● రెండు రోజుల్లో 10 మందిని కాటేసిన వైనం

భోగాపురం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): భోగాపురం గ్రామంలో కుక్కల స్వైరవిహారంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గత రెండు రోజుల్లో సుమారు 10 మందిని అవి కాటేశాయి. గ్రామంలో ఎక్కడ చూసినా కుక్కలు గుంపులుగుంపులుగా ఉంటున్నాయి. స్థానికులపై తిరగబడడంతో భయపడుతున్నారు. గ్రామంలోకి కొత్తగా వచ్చేవారిని మరింతగా వెంబడిస్తున్నాయి. రాత్రి సమయంలో బయటకు రావాలంటేనే టెన్షన్‌గా ఉంటోందని చెబుతున్నారు. కుక్కల బెడద లేకుండా చూడాలని అధికారులను కోరుతున్నారు.

అట్రాసిటీ కేసులో ఇద్దరికి జైలు 7లో

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

● ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు
● సర్టిఫికెట్ల మంజూరులో ఆలస్యం చేయవద్దు: కలెక్టర్ రామసుందర్‌రెడ్డి


మాట్లాడుతున్న రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇళ్ల స్థలాలు వచ్చే విధంగా కృషి చేయాలని, దీని కోసం వారి పేర్లు నమోదుకు అవకాశం కల్పించాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి అధికారులు ఆదేశించారు.ఇళ్ల స్థలాలకోసం పేర్లు నమోదు చేసుకోవడానికి ఈనెల 14 వరకూ ప్రభుత్వం గడువు ఇచ్చిందని,ఈవిషయాన్ని ప్రజలకు తెలియజేసి నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బుధవారం విజయనగరం నుంచి ఆయా శాఖ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇళ్లస్థలాలు మంజూరుకు గ్రామాల వారీగా ప్రణాళిక రూపొందించాలన్నారు. ఆయాగ్రామాల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న స్థలాలు, ఇంకా ఎంత కావాలి, తదితర వివరాలను సిద్ధం చేయాలని సూచించారు. సర్టిఫికెట్ల మంజూరులో జాప్యంచేయవద్దని కోరారు.ముటేషన్లు, ఇతర రెవెన్యూ సంబంధిత దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్క రించాలని కోరారు. రైస్ కార్డులు పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేయా లని జేసీ సేతు మాధవన్‌ను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, గోనె సంచులు, జీపీఎస్‌తో కూడిన వాహ నాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. రెండురోజుల్లో బ్యాంకుగ్యారెంటీలు పూర్తవుతాయని తెలిపారు.బీజీలు రానిచోట్ల మిల్లర్లతో మాట్లాడాలని సూచించారు. సమావేశంలో 12 రెవెన్యూ, అనుబంధ శాఖల అంశాలపై చర్చించారు.హౌసింగ్ ఫర్‌ఆల్, ఖాళీస్థలాలు రెగ్యు లరైజేషన్ స్కీమ్‌తో పాటు, భూబదిలీ, వెబ్‌ల్యాండ్‌పై చర్చించారు. సమావే శంలో ఇన్‌చార్జి డీఆర్వో మురళి, ఆర్డీవోలు పాల్గొన్నారు.

పథకాలను దివ్యాంగులు వినియోగించుకోవాలి

● దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు కార్యక్రమాలు


విజయనగరం: మాట్లాడుతున్న కృష్ణప్రసాద్

ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను దివ్యాంగులు వినియోగించుకోవాలని వక్తలు కోరారు. బుధవారం జిల్లాలోని భవిత కేంద్రాల్లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని ర్యాలీలతోపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన ప్రత్యేక అవసరాల గల బాలలకు బహుమతులు అందజేశారు.

●విజయనగరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు భారం కాదని సమాజంలో వారు కూడా భాగమేనని జిల్లా న్యాయసేవాధికారసంస్థకార్యదర్శి డాక్టర్ ఎ.కృష్ణప్రసాద్ తెలిపారు. బుధవారం ఆనందగజపతి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు హక్కులు, గౌరవం, ప్రేమ,ప్రోత్సాహం ఇవ్వడం అందరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టరు చిట్టిరాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఇన్‌చార్జి ఏడీ వెంకటేశ్వరరావు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

● గజపతినగరం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఎటువంటి సమస్యలు ఉత్పన్నమైనా కోర్టును ఆశ్రయిస్తే ఉచిత న్యాయసహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని న్యాయాధికారి ఎ.విజయ్‌రాజ్ కుమార్ తెలిపారు. స్థానిక భవితకేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎంఈవోలు ఎస్. విమలమ్మ, చంద్రశేఖర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

●రాజాం /రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను అన్ని విధాలా ఆదుకునేందుకు మండల న్యాయసేవాధికార సంస్థ కృషి చేస్తుందని సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ తెలిపారు. పట్టణంలోని భవిత కేంద్రాన్ని జూనియర్ న్యాయాధికారి నైమిషతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగాప్రభుత్వపరంగా వారికి అందుతున్న సౌకర్యాలు, సేవల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ప్రవీణ్‌కుమార్, దుర్గారావు, ఈఎన్‌టీ వైద్యుడు రాజు పాల్గొన్నారు.

● కొత్తవలస, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైకల్యం అనేది శరీరానికి మాత్రమే నని మనస్సుకాదని కొత్తవలస న్యాయస్థానం న్యాయాధికారి డాక్టర్ సముద్రాల విజయచందర్ తెలిపారు. మంగళపాలెంలోని గురుదేవచారిటబుల్‌ట్రస్టును, కొత్తవలసలోని చైతన్య మానసిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో గురుదేవ చారిటబుల్‌ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు, చైతన్య పాఠశాల వ్యవస్థాపకుడు సన్యాసిరావు, ప్రభుత్వ న్యాయవాది ఎంవీఎస్ గిరిబాబు పాల్గొన్నారు.

●శృంగవరపుకోట,డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విభిన్నప్రతిభావంతులకు రాజ్యాంగం సమాన అవకాశాలను కల్పించిందని శృంగవరపుకోట న్యాయాధికారి బి.కనకలక్ష్మి తెలిపారు. స్థానిక భవిత కేంద్రంలో మండల న్యాయ సేవా కమిటీ, సమగ్ర సర్వశిక్ష అభియాన్ అవగాహన సదస్సు నిర్వహించాయి. కార్యక్రమంలో ఎంఈవో గణపతి లక్ష్మి, న్యాయవాదులు గేదల ప్రకాశరావు, వారాది ఈశ్వరరావు, బొబ్బిలి రామకృష్ణ పాల్గొన్నారు.

●డెంకాడ, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి):రాయితీలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి కేవీ రమణ సూచించారు. డెంకాడ భవితకేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం పురస్కరించు కుని నిర్వహించిన కార్యక్రమంలో పలు ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో కృష్ణ, భవిత కేంద్రం సూపర్‌వైజర్ రవీంద్ర పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గిరిజనుడి మృతి

సీతంపేట రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిలగాం గ్రామానికి చెందిన గిరిజనుడు సవర చంద్రరావు (36) శ్రీకాకుళంలోని రిమ్స్‌లో చికిత్సపొందుతూ బుధవారం మృతి చెందాడు.ఎస్ఐ అమ్మనరావు కథనం మేరకు.. శిలగాం గ్రామానికి చెందిన చంద్రరావు కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్నాడు. దీనికి తోడు ఆర్థిక సమస్యలు ఎక్కువఅవ్వడంతో గత నెల 30న ఇంటి వద్ద పురుగు మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు చంద్రరావును 108లో సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై ఎస్ఐ కేసు నమోదు చేశారు.

అట్రాసిటీ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

సంతకవిటి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ఇద్దరికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ న్యాయాధికారి ఎస్ఎం ఫణికుమార్ తీర్పును వెలువరించారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ కథనం మేరకు.. సంతకవిటి మండలంలోని గోళ్లవలసకు చెందిన చింతాడఅసిరయ్యను ఉపాధిహామీ పనుల ఆడిట్‌జరిగే సమయంలో కులంపేరుతో గ్రామానికి చెందిన వెంపటాపు గోపి, కొప్పల రామినాయుడు దూషించారని 2020లో సంతకవిటి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. ఈ మేరకు సంతకవిటి పోలీసులు అట్రాసిటీ కేసు నమోదుచేశారు. అప్పటి ఎస్సీ సెల్ డీఎస్పీ సత్యనారాయణ దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్‌చేసి కోర్టులో అభియోగపత్రాలు దాఖలుచేశారు.ఈమేరకు గోపి, రామినాయుడుపై నేరం రుజువు కావడంతో నాలుగు సంవత్సరాలు ఆరునెలల జైలు శిక్ష, రూ.12 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితులకు శిక్షపడే వరకూ దర్యాప్తు నిష్పక్షపాతంగా చేసినందుకు సంతక విటి ఎస్ఐ గోపాలరావు, రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర, పోలీసు సిబ్బందిని ఎస్పీ దామోదర్ అభినందించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జరిమానా

రేగిడి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాడపేటకు చెందిన పేడాడ గణపతికి డ్రంకెన్‌డ్రైవ్ కేసులో రాజాం జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కె.నైమిష రూ.నాలుగు వేలు జరిమానా విధించారని రేగిడి ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో ఆయన మద్యంతాగి వాహనం నడిపిన కేసులో పట్టుబడినట్లు చెప్పారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

● లెఫ్టినెంట్ జనరల్ రవిశంకర్


రవిశంకర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్

విజయనగరం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):సైనిక స్కూల్ విద్యార్థులు దేశ నాయకులుగా తమ లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని లెఫ్టినెంట్ జనరల్ ఎస్‌పీ రవిశంకర్ ఆకాంక్షించారు. బుధవారం కోరుకొండలోని సైనికస్కూల్‌లో విద్యార్థులకు ధైర్యం, నాయకత్వంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ జనరల్ ఎస్‌పీ రవిశంకర్ నాయకత్వం విజేత జట్టు అన్న అంశంపై మాట్లాడారు. ధృడమైన సంకల్పంతో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. నిరంతరం కమ్యూనికేషన్ అవసరమని, అసాధారణమైన వాటిని అక్కడిక్కడే పరిష్కారాలు రూపొందించుకుని మార్గాలు అన్వేషించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ జనరల్ ఎస్ఎస్ శాస్త్రి, లెఫ్టినెంట్ జనరల్ రవిశంకర్‌కు జ్ఞాపిక,చిహ్నాన్ని అందజేశారు.

ట్రెంచ్ పనులను పూర్తిచేయండి: పీడీ


పనులు పరిశీలిస్తున్న పీడీ శారదాదేవి

నెల్లిమర్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):కుదిపిలో ట్రెంచ్ పనులను త్వరితగతిన పూర్యయ్యేలా చూడాలని మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం జిల్లా పీడీ శారదాదేవి కోరారు. బుధవారం కుదిపిలో ట్రెంచ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేతనదారులకు గిట్టుబాటు కలిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రామకృష్ణరాజు, ఏపీవో రామారావు, ఈసీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి వైద్యుల సదస్సు

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని వై జంక్షన్‌లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కాలేజీ ఆఫ్ జనరల్ ప్రాక్టీషనర్స్ జాతీయ స్థాయి సదస్సు శుక్రవారం నుంచి మూడురోజులు నిర్వహించనున్నట్టు ఐఎంఏ సీజీపీ హెడ్ క్వార్టర్స్ డీన్ డాక్టరు వీఎస్ ప్రసాద్ తెలిపారు. బుధవారం విజయనగరంలో విలేకరులతో మాట్లాడుతూ వైద్యుల సదస్సుకి జాతీయ అధ్యక్షుడు డాక్టరు దిలీప్ భానుసాలి, జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టరు బిడినహళ్, కోశాధికారి డాక్టరు పీయూష్ జైన్‌లు రానున్నట్లు చెప్పారు.

14న వెటరన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌నకు ఎంపిక

శృంగవరపుకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయనగరం డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఈనెల 14న జిల్లా స్థాయి వెటరన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ పొట్నూరుశ్రీరాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈపోటీల్లో 35 నుంచి 70 సంవత్సరాల వరకు స్త్రీపురుషులు వేర్వేరుగా సింగిల్, డబుల్స్ మిక్స్ విభాగాల్లో పాల్గొనవచ్చని తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులను ఫిబ్రవరిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని పేర్కొన్నారు.

ఆర్టీసీలో బదిలీలు

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పాలనాపరమైన సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారుల బదిలీలు పభుత్వం చేపట్టింది. ఇందులో భాగంగా ఏడీ అడ్మిన్‌గా ఉన్న జీవీ రవివర్మను ఏడీ ఇంజనీరింగ్‌కు బదిలీ చేశారు. జోన్-1ఏడీగా పనిచేస్తున్న కేఎస్ బ్రహ్మానందారెడ్డిని రవివర్మ స్థానంలో ఏడీ అడ్మిన్‌గా, ఆర్ఎంగా ఉన్న జి.విజయగీతను జోన్-1 ఏడీ ఇన్‌చార్జిగా నియమించారు.

జీతాలను పెంచాలి

కొత్తవలస, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 12న అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేస్తున్నట్లు కొత్తవలస ప్రాజెక్టు అధికారికి బుధవారం కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. జీతాలు పెంచాలని, 1810 మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చాలని కోరారు.

జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు రాజాం విద్యార్థి ఎంపిక

రాజాం/రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):రాజాంకు చెందిన డిగ్రీ విద్యార్థి టి.జగదీష్ శుక్రవారం నుంచి నుంచి హర్యానాలోని రోహతక్‌లో జరగనున్న జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు.ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రికెట్ అండర్-19 విభాగంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జగదీష్ సత్తాచాటాడు. ఈ మేరకు జగదీష్‌కు జీసీఎస్ఆర్ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ పురుషోత్తమరావు, ఫిజికల్ డైరెక్టర్ కేశవ నారాయణ అభినందించారు.

వ్యక్తిత్వ వికాసంతో అభివృద్ధి

శృంగవరపుకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిత్వ వికాసంతో అభివృద్ధి చెందుతారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు రేచర్ల శ్రీలక్ష్మి తెలిపారు. స్థానిక బర్మాకాలనీలో ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ - 1 విద్యార్థులు నిర్వహించిన శిబిరంలో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేశవరావు, పీవో భాస్కర్ పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా రవిశంకర్

గజపతినగరం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీవోగా డోల రవిశంకర్ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన డిప్యూటీఎంపీడీవో జనార్దనరావు బొండపల్లి బదిలీపై వెళ్లారు. దీంతో ద్వారపూడిలో గ్రేడ్ -1 విడీవోగా విధులు నిర్వహించిన రవిశంకర్ బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీవో బి.కళ్యాణి తెలిపారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి

భోగాపురం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌కు అనుగుణంగా రైతులు పంటలు పండించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి కోరారు. రైతులు చిరుధాన్యాలు పండించ డంపై దృష్టి సారించాలని తెలిపారు. బుధవారం భోగాపురం సచివాలయ ఆవరణలో రైతన్నా-మీకోసం సర్వేపై వర్క్‌షాపు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణమ్మ, ఎంపీడీవో డీడీ స్వరూపారాణి, వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ ఏడీలు నాగ భూషణ రావు, మహాపాత్రో, ఏవో హైమావతి పాల్గొన్నారు.

●రాజాం,డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని వ్యవసాయ శాఖ ఏడీ కె.చంద్రరావు సూచించారు. ఆగూరులో రైతన్నా-మీకోసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీను పాల్గొన్నారు.

● డెంకాడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ధ్యేయమని ఏవో టి. సంగీత తెలిపారు. మండలంలోని పినతాడివాడ, అక్కివరంల్లో రైతన్నా-మీకోసం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, ఎంపీటీసీ అచ్చం నాయుడు, పశువైద్యాధికారి దినేష్ పాల్గొన్నారు.

● శృంగవరపుకోట, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని ఎస్.కోట జనసేననాయకుడు ఒబ్బిన సన్యాసి నాయుడు రైతులకు సూచించారు. రైతు సేవా కేంద్రంలో రైతన్నా మీకోసం-వారోత్సవం నిర్వహించారు. ఏఈవో గీత పాల్గొన్నారు.

● వేపాడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సాగులో నూతనపద్ధతుల అమలుకు రైతులు ముందుకు రావాలని మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ కోరారు. మండలంలోని దబ్బిరాజుపేట గ్రామ రైతు సేవాకేంద్రంలో వ్యవసాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో రైతన్నా- మీకోసం కార్యక్రమం నిర్వహించారు.

వార్షిక ప్రణాళికలు తయారు చేయాలి

శృంగవరపుకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహిళ సంఘాలు అభివృద్ధికి వార్షిక ప్రణాళికలు తయారు చేయాలని శృంగవరపుకోట వెలుగు ఏపీఎం అరుణ స్వయం సహాయక సంఘ సభ్యులకు సూచించారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

●చీపురుపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):రానున్న ఐదేళ్లల్లో విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, సుస్థిర జీవనోపాదులు తదితర అంశాలపై ఎటువంటి అభివృద్ధి సాధించాలన్న అంశంపై తదిన ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఎంపీడీవో ఐ. సురేష్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో విజన్ బిల్డింగ్ అన్న అంశంపై వెలుగు ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు.కార్య క్రమంలో వెలుగు డీపీఎం జి. సీతారామయ్య, ఏపీఎం ఎన్. అప్పనాయుడు, డీఎంజీ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

హామీలు కాగితాలకే పరిమితం: ఎమ్మెల్సీ


జిందాల్ భూనిర్వాసితులతో మాట్లాడుతున్న రఘురాజు

శృంగవరపుకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భూములను తీసుకున్న సమయంలో ఇచ్చిన హామీలను కాగితాలకు పరిమితం చేశారని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆరోపించారు. విజయనగరంలో గురువారం జరగనున్న జిల్లా సమీక్ష సమావేశంలో జిందాల్ భూ నిర్వాసితుల సమస్యను ప్రస్తావిస్తానని తెలిపారు. బుధవారం మండలంలోని బొడ్డవరలో ఆందోళన చేస్తున్న జిందాల్ భూనిర్వాసితులతో కలిసి మాట్లాడారు. ప్రజాభిప్రాయ సేకరణలో ఇచ్చిన మాటలను నిలబెట్టుకోలేదన్నారు. పరిశ్రమల ద్వారా జరిగే అభివృద్ధికి వ్యతిరేకంకాదన్నారు. కాగా ఎస్.కోటలోలని గిరిజన కళాశాల బాలికల వసతిగృహానికి రఘురాజు సీసీ కెమెరాలు అందజేశారు. ఆయన వెంట ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, ఏఎస్.వెంకటరావు ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

డెంకాడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పేడాడ, రాజుల తమ్మాపురం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. బుధవారం పేడాడ, రాజుల తమ్మాపురం గ్రామాల్లో ప్రజలతో మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేడాడ పంచాయతీలో 2024-45, 2025-26 సంవత్సరాలకు గానూ రూ.71.40 లక్షల ఉపాధి హామీ పథకం పనులు మంజూరు చేయించామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.వాసుదేవరావు, పైల శంకరు, పాల శ్రీను, జొన్నాడ ప్రమీల పాల్గొన్నారు.

దాసరి కార్పొరేషన్ డైరెక్టర్లకు అభినందన

శృంగవరపుకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోటకు చెందిన నానిగిరి రమణాజీ, గనివాడ బంగారు నాయుడులు దాసరి కార్పొరేషన్ డైరెక్టర్లగా ప్రమాణ స్వీకారం చేయడంతో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అభినందించారు. బుధవారం విజయవాడలో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రామ ప్రసాద్, ఎస్.కోట పీఏసీఎస్ చైర్మన్ జీఎస్ నాయుడు, చక్కా కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గాంధీనగర్ సదస్సుకు నాగార్జున


మాట్లాడుతున్న నాగార్జున

చీపురుపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఈనెల 5,6 తేదీల్లో జరగనున్న ఎర్త్ సమ్మిట్ గ్రామీణాభివృద్ధికి దోహదపడుతుందని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున తెలిపారు. బుధవారం చీపురుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సహకార బ్యాంకు చైర్మన్ హోదాలో తాను ఈ సదస్సుకు హాజరవుతున్నానని చెప్పారు. గ్రామీణ భారత్ అభివృద్ధి, నూతన సాంకేతికత, డిజిటల్ పరిష్కారాలు, ఆర్థిక సేవల్లో కొత్త అవకాశాలను అధ్యయనం చేసే అవకాశం దీని ద్వారా లభిస్తుందన్నారు.

రెవెన్యూ వసూళ్లను ముమ్మరం చేయాలి: కమిషనర్


రికార్డులను తనిఖీ చేస్తున్న నల్లనయ్య

విజయనగరం టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ వసూళ్లను ముమ్మరం చేసి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని నగరపాలకసంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. బుధవారం విజయనగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందికి, సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. అలాగే సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని నల్లనయ్య తెలిపారు. నగరంలోని రింగురోడ్డు,తోటపాలెం, రాజీవ్‌నగర్ కాలనీల్లో ఆయన పర్యటించారు.

సమయపాలన పాటించాలి

వేపాడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):విధి నిర్వహణలో సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ హెచ్చరించారు. బుధవారం మండలంలోని సోంపురం గ్రామసచివాలయాన్ని తనిఖీచేశారు. ఈసందర్భంగా చెత్తకు సంపద కేంద్రాన్ని పరిశీలించారు. తడి,పొడి చెత్త విడివిడిగా సేకరించాలని, తడిచెత్త నుంచి వర్మీకంపోస్టు తయారు చేయాలని సూచించారు. అనంతరం గ్రామం లో ఉపాధిహామీ పనులను పరిశీలించారు.

పంట మార్పిడి పద్ధతులు పాటించండి: జేసీ


రైతు సేవాకేంద్రంలో తనిఖీ చేస్తున్న జేసీ సేతుమాధవన్

గంట్యాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులు అధిక దిగుబడి కోసం పంట మార్పిడి పద్దతులను అవలంబించాలని జేసీ సేతుమాధవన్ కోరారు. బుధవారం మండలంలోని కొర్లాంలో నిర్వహించిన మీకోసం వర్క్‌షాపు నిర్వహించారు. తొలుత గ్రామానికి చెందిన రైతులు పలు సమస్యలను జేసీ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలోని రీసర్వే జరగడంతో పలు సమస్యలు ఉన్నాయని, గ్రీన్ పీల్డ్ హైవే కోసం సేకరించిన భూమికి సంబంధించిన ప్రభుత్వం ఇస్తామన్నా 30 శాతం పరిహారం ఇవ్వలేదని, నీటి వసతులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని వివరించారు. అనంతరం జేసీ సేతుమాధవన్ మాట్లాడుతూ వరికి బదులు పంటమార్పిడి చేయడంతోపాటు ఉద్యాన పంటల సాగుపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో నిర్వహించిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. వెంకటరమణ రైస్ మిల్లును తనిఖీచేశారు. అక్కడ నుంచి కొండతామారాపల్లిలో ఆదర్శ రైతు సాగు చేస్తున్న టమాట పంటను పరిశీలించారు. కార్యక్రమంలోని ఉద్యాన శాఖ డీడీ చిట్టిబాబు, తహసీల్దార్ నీలకంఠశ్వరరెడ్డి, ఏవో శ్యామ్ కుమార్, సీఎస్‌డీటీ నారాయణమూర్తి పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు మంజూరు చేయండి

●సమస్యలు పరిష్కరించని దినోత్సవాలు ఎందుకని దివ్యాంగుల నిరసన


నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా దినోత్సవాలు ఎందుకు నిర్వహిస్తున్నారో తెలియడం లేదని దివ్యాంగులు ప్రశ్నించారు. తక్షణమే సదరం సర్టిఫికెట్ల సమస్యను పరిష్కరించాలని సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ కలెక్టరేట్ గేటు ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్లకు సంబంధించి వైకల్యం శాతాలను తగ్గించడంతో దివ్యాంగులు ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు.అర్హత గల దివ్యాంగులకు కొత్త పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. గత ప్రభుత్వం హయంలో సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్‌లో నష్టపోయిన దివ్యాంగుల పింఛన్లు పునరుద్దరించాలని కోరారు. వివాహం చేసుకున్న దివ్యాంగులకు పెళ్లి కానుక మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలోని సంఘ నాయకులు జేసుదాసు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

దత్తిరాజేరు, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని షికారుగంజి ఆదర్శ పాఠశాల విద్యార్థులు గత నెలలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో సత్తాచాటారు.ఈమేరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జి.హారిక, బి.చంద్రహాసిని శ్రీకాకుళంలో జరిగిన క్రికెట్, సత్యసాయి జిల్లాలో జరిగిన జూడో పోటీల్లో కాంస్య పతకాలు సాధించారు. ఈ మేరకు విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ రాజేష్‌లు అభినందించారు.

గ్రీన్ అంబాసిడర్ల జీతాలు చెల్లించాలి


ఎంపీడీవో కార్యాలయంవద్ద ఆందోళన చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

దత్తిరాజేరు, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌అంబాసిడర్ల జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద గ్రీన్‌అంబాసిడర్ల సమస్యల పరిష్కారానికి ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీస వేతనం ఇవ్వాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవోకార్యాలయ జూనియర్‌అసిస్టెంట్‌కు అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు కె.నూకరాజు, జి.మూర్తి, ఎం.కృష్ణ, సింహాచలం, కోట అప్పారావు, ఈ.అప్పన్న పాల్గొన్నారు.

జీడిమామిడిలో మెలకువలు పాటిస్తే లాభాలు

గరివిడి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జీడిమామిడి పంటలో మెలకువలు పాటించి పండిస్తే మంచి లాభాలు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసరాజు తెలిపారు. బుధవారం మండలంలోని వెదుళ్లవలసలో చీపురుపల్లి ఉద్యానాధికారి ఎం.అనూష ఆధ్వర్యంలో మామిడి, జీడి పంట రైతులకు శిక్షణకార్యక్రమం నిర్వహించారు.

రైల్వే లోకో సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

విజయనగరం బాబామెట్ట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైల్వే లోకో సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు జగన్మోహన్‌రావు, బి.రమణలు డిమాండ్ చేశారు. రన్నింగ్ స్టాఫ్ భద్రతా, ఆర్థికసమస్యలపై స్పందించాలని కోరారు. విజయనగరంలోని రైల్వే టూల్స్ కార్యాలయం వద్ద సమస్యల పరిష్కారానికి రైల్వే లోకో రన్నింగ్ స్టాఫ్ చేపట్టిన నిరాహార దీక్ష బుధవారం రెండో రోజుకుచేరంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం నవంబరు 21న ప్రవేశపెట్టిన లేబర్ కోర్టుఉపసహరించుకోవాలని కోరారు.కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు సీఎస్ రావు, సింహాచలం, పడాల రవికుమార్,శ్రీనివాస్ పాల్గొన్నారు.


దీక్షలోపాల్గొన్న సీఐటీయూ నాయకులు,లోకోరన్నింగ్ స్టాఫ్ ప్రతినిధులు

మరోసారి తెరపైకి

(ఐదో పేజీ తరువాయి)

సర్వే చేపట్టారు. ఇందుకోసం కొన్ని పారామీటర్స్‌ను నిర్దేశించారు. సబ్జెక్టువారీగా విద్యార్థులకు వచ్చిన మార్కులతో పాటు నాలుగు గ్యారంటీడ్ ఫండమెంటల్ లిటరసీ న్యూమరసీ (జీఎఫ్ఎల్ఎన్)అంశాలను పరిగణనలోకి తీసుకొని సర్వే నిర్వహిస్తున్నారు. విద్యార్థుల మార్కులతో పాటు స్పీకింగ్, లెర్నింగ్, రైటింగ్ తదితర నైపుణ్యాలను పరిశీలిస్తారు.

ఉపాధ్యాయుల్లో మిశ్రమ స్పందన..

గ్రేడింగ్‌పై ఉపాధ్యాయులు భిన్నంగా స్పందిస్తున్నారు. విద్యావ్యవస్థలో సమూలమైన సంస్కరణలను తీసుకొచ్చి అభ్యుదయ ప్రగతిని సాధించాలన్నది సర్కారు సంకల్పం. ఇది మంచి ఆలోచనే కానీ పట్టణ, గ్రామీణ, ఇతర వెనుకబడిన ప్రాంతాలకు చెందిన అన్ని పాఠశాలలకు ఒకే రకమైన పారామీటర్స్ తెస్తే కొన్ని ఇబ్బందులు ఉంటాయని పలువురు భావిస్తున్నారు. ఉపాధ్యా యులు రోజంతా శ్రమించి తరగతి గదిలో పాఠాలు చెప్పినా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యంలో (ఐక్యూ లెవెల్స్)లో తేడాలు ఉంటాయంటున్నారు. వలస వెళ్లిన తల్లిదండ్రుల పిల్లలు కాస్త వెనకబడి ఉంటుంటారని, కొన్ని పాఠశాలల్లో అధికంగా, మరికొన్ని చోట్ల తక్కువగా విద్యార్థుల సంఖ్య ఉంటుందని, ఆయా చోట్ల బోధన, మార్కుల కొలమానం వేరుగా ఉంటుందని చెబుతున్నారు. అన్నిటికీ ఒకే మూసపద్ధతిని వర్తింపజేయకూడదన్నది మెజార్టీ ఉపాధ్యాయుల అభిప్రాయం.

● ఎన్‌సీఆర్‌టీ సిలబస్‌ను అమలు చేస్తుండడం పెను సమస్యగా ఉపాధ్యాయులు భావిస్తున్నారు. బండెడు సిలబస్‌ను బాగా తగ్గించాలంటున్నారు. ఒక్కో పాఠం చాలా పెద్దదిగా ఉంటోందని, అప్లికేషన్ మెథడ్‌లో పరీక్షలను సెంట్రలైజ్డ్ పద్ధతిలో నిర్వహించడం లోపభూయిష్టంగా తయారైందని అభిప్రాయపడుతున్నారు.

పనితనంపై సర్వే..

క్లస్టర్ వారీగా ఉపాధ్యాయుల పనితనానికి సంబంధించి జీఎఫ్ఎల్ఎన్ సర్వేను ప్రభుత్వం చేపట్టింది. దీనిపై అన్ని జిల్లాల నుంచి నివేదిక అందాక ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. పరీక్షలలో సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు వచ్చిన సగటు మార్కుల ఆధారంగా ఈ సర్వే జరుగుతోంది. జిల్లాలో ఒక డైట్ విద్యార్థి, సీఆర్ఎంటీ కలిసి ఈ సర్వే నిర్వహిస్తున్నారు.

-కె.మోహనరావు, డిప్యూటీ విద్యాశాఖాధికారి, బొబ్బిలి

బోధనకు ఇన్‌స్ట్రక్టర్లు

(ఐదో పేజీ తరువాయి)

ప్రభుత్వం రూ.8.21 కోట్లను సమగ్ర శిక్షకు కేటాయించింది. జిల్లాలో ఎక్కువగా హిందీ స్కూల్ అసిస్టెంట్లు, తెలుగు స్కూల్ అసిస్టెంట్ల ఖాళీలను ఇన్‌స్ట్రక్టర్లతో భర్తీ చేయనున్నారు.

● కేవలం మే 7 వరకూ.. 5 నెలల కాలంపాటే వీరు విధుల్లో ఉంటారు. అయితే అప్పటికీ డీఎస్సీ నోటిఫికేషన్ రాకుంటే మాత్రం వచ్చే విద్యాసంవత్సరంలో కూడా వీరినే కొనసాగించే అవకాశం ఉందంటున్నారు. మండలంలో ఖాళీలపై ఎంఈవో ప్రకటన విడుదల చేయనున్నారు. ఈ నెల 7 వరకూ దరఖాస్తులకు గడువు ఉంది. 8న భర్తీ చేస్తారు. 9 నుంచి విధులకు హాజరుకావాల్సి ఉంటుంది.

ఇంకో చాన్స్

(ఐదో పేజీ తరువాయి)

ఉంటున్నారు. జిల్లావ్యాప్తంగా వేలాది మంది ఉన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరు చేసింది. 2018 వరకూ బిల్లులు బాగానే చెల్లించినా.. అటు తరువాత కేవలం ఖాతాలో రూ.1 మాత్రమే పడింది. వారిని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. అయితే బిల్లులు రాలేదని ఇప్పుడు దరఖాస్తు చేసి ఉంటే తిరస్కరణకు గురవుతున్నాయి. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో జగనన్నకాలనీ పేరుతో లబ్ధిదారులకు సెంటున్నర స్థలం ఇచ్చిన సంగతి తెలిసిందే. కానీ చాలామందికి పట్టాలిచ్చి ఆ స్థలాలు ఎక్కడున్నాయో చూపలేదు. అటువంటి వారి దరఖాస్తులు సైతం తిరస్కరణకు గురవుతున్నాయి.

సిబ్బందిపై ఫిర్యాదులు..

గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జరుగుతోంది. పేదల అర్హత పత్రాలను పరిశీలించి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలు వారి లాగిన్లలో వివరాలు నమోదు చేయాలి. అయితే సచివాలయాల్లో వీరు అందుబాటులో ఉండడం లేదన్న విమర్శలున్నాయి. స్థలం కోసం అయితే ముందుగా వీఆర్వోను సంప్రదించాలి. కార్యాలయాల్లో వీఆర్వోలు అందుబాటులో ఉండడం లేదని ఎక్కడికక్కడే ఫిర్యాదులున్నాయి. ఇటీవల ఈ ఫిర్యాదులు ఎక్కువ కావడంతో మండల ప్రత్యేకాధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఓ జిల్లా అధికారి ఇటీవల ఏకకాలంలో సచివాలయాలను సందర్శించగా వీఆర్వోలు ఉండడం లేదని స్పష్టమైంది. ఈ విషయంలో కలెక్టర్ ఇటీవల ముగ్గురు సచివాలయ ఉద్యోగులకు నోటీసులు ఇచ్చారు. కనీసం ఈ 11 రోజులైనా సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

పరిష్కరిస్తారో.. లేదో!

(ఐదో పేజీ తరువాయి)

పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ సమస్యలపైనే 60 శాతం పైబడి వినతులు వస్తున్నాయి. ఇచ్చిన వినతులకు మోక్షం ఉండడం లేదు. అర్జీదారులు మళ్లీ మళ్లీ అవే సమస్యలపై వినతులు అందిస్తున్నారు. గత ప్రభుత్వ హయంలో జరిగిన ఫ్రీహోల్డ్ భూములపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో రైతులు అయోమయంలో ఉన్నారు. ప్రధానంగా రీసర్వే గ్రామాల్లో అనేక సమస్యలు ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే చాలా గ్రామాల్లో గ్రామ పురోణీలు అధికంగా ఉన్నాయి. భూమిపై ఒకరు ఉండగా, వెబ్‌ల్యాండ్‌లో మరొకరు ఉండటంతో రైతులు ఈ సమస్య పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు ధాన్యం కొనుగోలు తంతు మందకొడిగా జరుగుతుండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలల్లో ఆర్‌వో ప్లాంట్‌లు లేక విద్యార్థులను తాగునీటి సమస్య వెంటాడుతోంది. సాగునీటి ప్రాజెక్టుల పనులు ఎక్కడివక్కడే ఉండిపోయాయి. వీటన్నింటిపై జిల్లా సమీక్షలో చర్చించి పరిష్కారం దిశగా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

గురుకులం అభివృద్ధికి రూ. 4.30 కోట్లు ఇవ్వండి

● మంత్రి లోకేశ్‌ను కోరిన ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని ప్రభుత్వ బాలుర గురుకుల పాఠశాల అభివృద్ధికి రూ. 4.30 కోట్లు మంజూరు చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఎమ్మెల్యే బేబీనాయన వినతిపత్రం అందజేశారు. బుధవారం అమరావతిలో లోకేశ్‌ను ఎమ్మెల్యే కలిశారు. స్థానిక గురుకులాన్ని తాను దత్తత తీసుకున్నానని, ఇక్కడ సదుపాయాల కల్పనకు కార్యాచరణను రూపొందించామన్నారు. ఇప్పటికే పూర్వవిద్యార్థుల సౌజన్యంతో పలు వసతులు కల్పించారన్నారు. ఇంకా పాఠశాలను సమూలంగా తీర్చిదిద్దేందుకు నిధులు అవసరమన్నారు. ఇందుకు ఇంజనీరింగ్ అధికారులు అంచనా వేశారన్నారు. గురుకులాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసిన తర్వాత పాఠశాలను సందర్శించాలని లోకేశ్‌ను ఎమ్మెల్యే ఆహ్వానించారు. అలాగే బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. వీటన్నింటిపై మంత్రి లోకేశ్ సానుకూలంగా స్పందించారని, గురుకులం అభివృద్ధికి, కొత్త కళాశాలల మంజూరుకు సహకారం అందజేస్తామని హామీ ఇచ్చారని బేబీనాయన తెలిపారు.



లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

స్క్రబ్ టైఫస్‌పై ఆందోళన వద్దు

(ఐదో పేజీ తరువాయి)

కాటు వేసిన చోట నల్లటి పూతలా కనిపించే గాయం (ఎస్కార్) స్క్రబ్ టైఫస్ లక్షణాలుగా వివరించారు. స్క్రబ్ టైఫస్ డాక్సిసైకిన్ ముందు అందుబాటులో ఉందని, వైద్యుల సూచనలు మేరకు చికిత్స తీసుకుంటే రోగం పూర్తిగా నయమవుతుందన్నారు. గర్భిణులు, చిన్నపిల్లలు అజిత్రమైసిన్ వంటి ప్రత్యామ్నాయ మందులు వైద్యుల సలహా మేరకు వాడుకోవాలని సూచించారు. అవసరమైన మందులన్నీ ప్రతి పీహెచ్‌సీ, సిహెచ్‌సీ, వెల్నెస్ కేంద్రాల్లో ఉచితంగా లభ్యమవుతాయన్నారు. ఈ వ్యాధికి వ్యాక్సిన్ అందుబాటులో లేనందున, మైట్స్ కాట్లను నివారించడమే ప్రధాన రక్షణ చర్యగా తెలిపారు. పొడవైన దుస్తులు ధరించడం, దుస్తులను శుభ్రపరచడం, ఇళ్లు, చెరువు పరిసరాల్లో ఉండే పొదలు, గడ్డి తగ్గించడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. ● కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు స్వప్రయోజనాల కోసం స్క్రబ్ టైఫస్ పాజిటివ్ ఉందంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఇప్పటికే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వారి ద్వారా అటువంటి వారికి నోటీసులు జారీ చేయడంతో పాటు అన్ని ప్రైవేటు వైద్య సంస్థలతో గురువారం సమావేశం ఏర్పాటుకు ఆదేశించామని తెలిపారు.

రైతుకు అన్ని విధాలా మద్దతు

(ఐదో పేజీ తరువాయి)

రూపొందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రాధాన్యం ఉన్న పంటలు సాగుచేసేలా అవగాహన కల్పించాలని చెప్పారు. అందుకు అవసరమైన వనరుల ఏర్పాటుకు ప్రభుత్వం ముందుంటుందన్నారు. ఆదాయ, జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకునేందుకు కొత్త కోణాల్లో పంట సాగుకు అన్వేషించాలని సూచించారు.

5వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు

పశువృద్ధి, వ్యవసాయం, ఉద్యాన పంటలు పెంచే బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బంది తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఏటా 5 వేల హెక్టార్లలో ఉద్యానవన పంటలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. 5 ఎకరాలకు పైబడి ఉన్న రైతులకు పామాయిల్ సాగుకు సహకారం అందిస్తామని చెప్పారు. డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు కోపరేటివ్ బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. బ్యాంకును బలోపేతం చేసేలా డిపాజిట్లు చేసుకోవాలని సూచించారు. మొండి బకాయిలు పేరుకుపోవడంతో పూర్తిస్థాయిలో సహకారం అందించేందుకు కొంత ఇబ్బందిగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, మాజీ మంత్రి పడాల అరుణ, రెడ్డి పావని, యర్రాపు సురేష్, బొండపల్లి, గజపతినగరం, దత్తిరాజేరు టీడీపీ అధ్యక్షులు రాపాక అచ్చంనాయుడు, గంట్యాడ శ్రీదేవి, చప్ప చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల అభ్యున్నతికి ఇక్కడే పునాది

(ఐదో పేజీ తరువాయి)

విజయనగరంలో స్మారక కళాపీఠం నిర్వహిస్తూ వస్తోంది. ఘంటసాల విజయనగరంలోని సంగీత కళాశాలలో 1936 నుంచి 1942 వరకూ సంగీతం నేర్చుకుని పట్టా అందుకున్నారు. ఆ సమయంలో సమీపంలో ఉన్న ఎల్లమ్మ గుడిలో తలదాచుకుంటూ విద్యను అభ్యసించేవారు. ఎంతో మంది ఘంటసాల సంగీతానికి అనర్హుడని అనేవారట. ఆ మాటలు ఆయనలో మరింత జిజ్ఞాసను పెంచాయి. ఎలాగైనా సంగీతంలో ప్రావీణ్యం పొంది మంచి సంగీత విద్వాంసుడు కావాలని సంకల్పించారు. ఇక్కడ డిగ్రీ పట్టా తీసుకున్న తరువాత ఇతర ప్రాంతాలకు వెళ్లి చిన్న చిన్న కచేరీలు నిర్వహించేవారు. ఆ తర్వాత ఆయన ప్రయాణం, పేరు ప్రఖ్యాతలు దేశాన్ని దాటాయి. ఆయన అభిమానులు ప్రపంచ నలుమూలలా ఉన్నారు.

కాగా విజయనగరంలోని ఆయన అభిమానులు ఘంటసాల స్మారక కళాపీఠంగా ఏర్పడి ఏటా సభలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 103వ జయంతి ఉత్సవాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. కళాపీఠం గౌరవ అధ్యక్షుడు సోమయాజులు, వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.భీష్మారావు, దుర్వాసుల రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి దవళ సర్వేశ్వరరావు, కార్యదర్శి ఉమాశంకర్, కోశాధికారి వైవీవీ సత్యనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు బొత్స సూర్యనారాయణ, ఎస్‌వీఎస్ఎల్ఎన్ గుప్తా ఆధ్వర్యంలో ఘంటసాల జయంతి ఉత్సవాలు గురు, శుక్రవారాల్లో జరగనున్నాయి.

మామిడివలస మాజీ సర్పంచ్ మృతి

రామభద్రపురం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మామిడివలస మాజీ సర్పంచ్ మండల సన్యాసిరావు(55) బుధవారం ఉదయం మృతి చెందారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

దివ్యాంగులకు ఆత్మస్థైర్యమే ఆయుధం

బొబ్బిలి, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఆత్మస్థైర్యమే ఆయుధం అనిమున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనరు లాలం రామలక్ష్మి ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్‌బాబు మాట్లాడుతూ దివ్యాంగులపై సానుభూతి చూపడం కన్నా వారికి చేయూతనందివ్వడం అవసరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దమనసుతో దివ్యాంగులకు సామాజిక పింఛన్‌ను రూ.6 వేలు చొప్పున పెంచి భరోసా కల్పించారన్నారు. పీఎం స్వనిధి కింద బొత్స ఎర్రయ్య, వేపుపల్లి వెంకట దుర్గాప్రసాద్‌లకు రూ. 15 వేలు చొప్పున బ్యాంకు రుణాలను అందజేశారు. నారంశెట్టి ఈశ్వరమ్మకు వినికిడి పరికరం అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం నేత చీమల రాంబాబు, టీపీఆర్‌వో మామిడి జగన్మోహనరావు, సీఎంఎం బి.వేణుగోపాలరావు, సీవోలు భానుప్రకాశ్, చిట్టెమ్మ, రామలక్ష్మి, పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు రుణాలు పంపిణీ చేస్తున్న చైర్మన్

ఆకుల రెల్లివీధికి పైప్‌లైన్ వేయండి

బొబ్బిలి, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీలోని ఆకుల రెల్లివీధిలో ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు అవసరమైన పైప్‌లైన్ వేయాలని ఇంజనీరింగ్ సిబ్బందిని మున్సిపల్ చైర్మన్ లాలం రామలక్ష్మి ఆదేశించారు. బుధవారం రావువారి వీధి, ఆకులరెల్లి వీధి తదితర ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. ఆయా వీధులల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడారు. ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించే ఏర్పాటు చేశారు. చెత్తలు పారబోసేవారిపై చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టరు మురళి, పర్యావరణ ఇంజనీర్ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

దివ్యాంగుల విద్యాభివృద్ధికి కృషి

బొబ్బిలి రూరల్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల విద్యాభివృద్ధి కోసం ఉన్నత పాఠశాల స్థాయిలో ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించామని ఎంఈవో సీహెచ్.రమేశ్ అన్నారు. బుధవారం స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలని కోరారు. అనంతరం మున్సిపల్ తాండ్రపాపారాయ స్కూల్ హెచ్ఎం మౌనిక మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో-2 గొట్టాపు వాసు, ఉపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు పి.కృష్ణమోహన్, గొంగాడ రవి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో రమేశ్

●బాడంగి, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎంఈవో లక్ష్మణదొర పాల్గొని మాట్లాడారు. సమాజంలోని దివ్యాంగుల హక్కులు, గౌరవాన్ని ప్రోత్సహించడం, వారి శ్రేయస్సుకు అవగాహన పెంచడం ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యమన్నారు. హెచ్ఎం సత్యనారాయణ మాట్లాడుతూ శారీక వైకల్యం ఉన్నప్పటికీ వారి ఆలోచనలు, సామర్థ్యాలు, ప్రతిభ అపారమైనవన్నారు. అంగవైకల్యం శరీరానికే తప్ప ఆలోచనకు కాదన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావు, ఐఈఆర్‌సీ సత్యనారాయణ, సహిత ఉపాధ్యాయులు రమేష్, శ్రీనివాసరావు, శంకర్, రామకృష్ణ పాల్గొన్నారు.

పారాదిలో 'రైతన్నా మీకోసం'

బొబ్బిలి రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పారాదిలో బుధవారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ఏవో మజ్జి శ్యామ్‌సుందర్ నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి భద్రత, పంటల మార్పిడి, రసాయన ఎరువల వాడకం తగ్గించడం, ప్రకృతి సేద్యంపై మొగ్గు చూపడం, ఫుడ్ ప్రొసెసింగ్ తదితర పంచ సూత్రాలపై రైతులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు నూకమనాయుడు, రైతులు పాల్గొన్నారు.

●బాడంగి, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): బొత్సవానివలస రైతు సేవాకేంద్రంలో బుధవారం రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా బుధవారం రైతులకు వర్క్‌షాప్ నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి జి.సూర్యప్రకాశ్, టీడీపీ మండల అధ్యక్షుడు టి.రవిబాబుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రొసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు తదితర వాటిని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొంతు త్రినాథ, వైస్ ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు, పీఏసీఎస్ చైర్మన్ ఎల్.సత్యం, సర్పంచ్ పైల మేరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు యజ్జల లక్ష్మి పాల్గొన్నారు.

నేడు డీడీవో కార్యాలయం ప్రారంభోత్సవం

బొబ్బిలి రూరల్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలో నూతనంగా నిర్మించిన డీడీవో కార్యాలయాన్ని గురువారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభోత్సవం చేయనున్నారని డీడీవో ఎం.కిరణ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఆయనతో పాటు ఎంపీడీవో పి.రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు, పీఆర్ డీఈఈ వసంత అప్పారావు, ఏఈ రాజశేఖర్ ఉన్నారు.

ఎమ్మెల్యేకి విద్యార్థి సంఘాల కృతజ్ఞతలు

బొబ్బిలి, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు కోసం చిత్తశుద్ధితో కృషితో చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయనకు వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులు బుధవారం వినూత్నంగా కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో ఏపీఎస్ జేఏసీ ప్రధాన కార్యదర్శి బీసపు సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులు థాంక్యూ ఎమ్మెల్యే సార్ అంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గం ఏర్పాటై 74 సంవత్సరాలైందని, తొమ్మిది మంది ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించారన్నారు. విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు ఎన్నోసార్లు పోరాటాలు చేసినా ప్రభుత్వ కళాశాలలు మంజూరు కాలేదన్నారు. బేబీనాయన మాత్రం చొరవ తీసుకొని సీఎం చంద్రబాబు, విద్యామంత్రి నారా లోకేశ్‌ను నేరుగా కలిసి ప్రభుత్వ కళాశాలల ఏర్పాటు కోసం ఒత్తిడి తీసుకురావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు హేమంత్, అనిల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ●కళాశాలల ఏర్పాటు కోసం బేబీనాయన చొరవ తీసుకోవడంపై ఏబీవీపీ పట్టణ అధ్యక్షుడు ప్రగడ సత్యనారాయణ, ధనుంజయ్, గంగరాజు హర్షం వ్యక్తం చేశారు.



గాంధీబొమ్మ సెంటర్‌లో ప్రదర్శన నిర్వహించిన విద్యార్థులు

పారా స్పోర్ట్స్ మీట్‌లో సత్తాచాటిన భవ్యశ్రీ

బాడంగి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని విజ్జీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి పారా స్పోర్ట్స్ మీట్‌లో బాడంగి గ్రామానికి చెందిన తెంటు భవ్యశ్రీ సత్తాచాటింది. లాంగ్ జంప్, రన్నింగ్ పోటీల్లో ప్రథమ స్థానం పొంది గోల్డ్ మెడల్ సాధించింది. శ్రీకాకుళం జిల్లాలో జరగనున్న జోనల్ పోటీలకు ఎంపికైంది. అలాగే బెహర మణిదీపిక సబ్ జూనియర్ గర్ల్స్ పరుగు పోటీల్లో 3వ స్థానం సాధించి బ్రాంజ్ మెడల్ పొందింది. వీరితోపాటు అనిల్, అజయ్ పరుగు పందెం, షార్ట్‌పుట్ పోటీల్లో పాల్గొని ప్రశంసాపత్రాలు పొందారు. వీరికి శిక్షణ ఇచ్చిన పారా స్పోర్ట్స్ శిక్షకులు కొల్లి ఈశ్వరరావు, గండి సరిత, సిద్ధా సత్యనారాయణమూర్తి, ఎంఈవో లక్ష్మణదొర, హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పంట నష్టం లేకుండా పరిహారం

బొబ్బిలి రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతుల పంటలకు ఎటువంటి నష్టం జరగకుండా భూమికి పరిహారం చెల్లిస్తామని హెచ్‌పీసీఎల్ భూసేకరణ అధికారి ఎస్.సుధాసాగర్ వివరించారు. విశాఖపట్నం నుంచి రాయపూర్ హెచ్‌పీసీఎల్ కంపెనీ పైప్‌లైన్ వేయనున్న నేపథ్యంలో బుధవారం మండల పరిషత్ కార్యాల యంలో రైతులతో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సేకరణ అధికారి మాట్లాడుతూ జె.రంగరాయపురం, అలజంగి, పిరిడి, కమ్మ వలస గ్రామాల పరిధిలో పొలాల మీదుగా 36 అడుగుల వెడల్పుతో ఏర్పా టు చేయనున్న పైప్‌లైన్‌కు భూమిని సేకరిస్తున్నామని వివరించారు. భూ సేకరణ వల్ల రైతులకు పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లబోదన్నారు. భూ గర్భంలో పైప్‌లైన్‌లో వేయడం వల్ల పైభాగాన పంటలను పండించు కోవచ్చన్నారు. సమావేశంలో హెచ్‌పీసీఎల్ చీఫ్ జి.కిశోర్‌కుమార్, ఎంపీడీవో పి. రవికుమార్, రిటైర్డ్ తహసీల్దార్ గిరడ అప్పలనాయుడు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న భూసేకరణ అధికారి

షిర్డీలో కళాకారుల నృత్య ప్రదర్శన

బొబ్బిలి, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన 22 మంది కళాకారులు బుధవారం షిర్డీలోని సాయిబాబా మందిరం ప్రాంగణంలో శతాబ్ది మండపంలో నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. బాబా భక్తిగీతాలకు నృత్యాలు చేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు.



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

రామభద్రపురం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం వాహన తనిఖీలను ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించి అన్ని పత్రాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఆయనతో పాటు ఎస్ఐ వెలమల ప్రసాదరావు, ఏఎస్ఐ ఆర్.అప్పారావు ఉన్నారు.

ఉర్రూతలూగించిన డ్యాన్స్ పోటీలు



డ్యాన్స్‌లతో అదరగొడుతున్న యువతీ యువకులు

బొబ్బిలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కళాభారతి ఆడిటోరియంలో బుధవారం రాత్రి నిర్వహించిన డ్యాన్స్ పోటీలు యువతను ఉర్రూతలూగించాయి. డ్యాన్స్ మాస్టర్లు సూర్య, స్వప్న ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాల నుంచి కళాకారులు పాల్గొన్నారు. సీఐ కటకం సతీష్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని నిర్వాహకులను అభినందించారు. కోలాటం డ్యాన్స్ మాస్టర్ కరుణకుమార్, కళాభారతి కార్యదర్శి నంబియార్ వేణుగోపాలరావు, కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు తదితరులు పాల్గొన్నారు. విజేతలకు వరుసగా రూ. 15 వేలు, 10 వేలు, రూ. 5 వేలు చొప్పున నగదు బహుమతులను అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా విజయవాడకు చెందిన షైను, వినోద్, పవన్ పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

బొబ్బిలి రూరల్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఏపీఎం భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు నూతన పారిశ్రామిక విధానం, మహిళకు ప్రోత్సాహకాలు అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోడల్ మండల సమాఖ్యగా విజన్ బిల్డింగ్‌కు బొబ్బిలి మండలం ఎంపికైందని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌సీసీ శ్రీహరిరావు, సీసీలు కోటేశ్వరరావు, నిర్మల, కేశవ, కృష్ణారావు, ఎంఎస్ కార్యదర్శి అల్లాడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కోడూరు విద్యార్థులు

బాడంగి, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు కోడూరు పాఠశాలకు చెందిన బి.హేమ, బి.రమ్య ఎంపికైనట్టు హెచ్ఎం శ్రీదేవి తెలిపారు. పల్నాడు జిల్లాలో ఈ నెల 1, 2 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పీడీ భాస్కర్, ఉపాధ్యాయులు అభినందించారు.

సాగు భూములను ఏపీఐఐసీకి కేటాయించడం తగదు

●అభ్యంతరం తెలిపిన గిరిజనులు

రామభద్రపురం, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల నుంచి సాగుచేసుకున్న భూములను ఏపీఐఐసీకి కేటాయించడం సబబుకాదని కారేడువలస గిరిజనులు అన్నారు. బుధవారం మండల రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ, పోలీసు, ఫారెస్టు, ఏపీఐఐసీ అధికారులు, గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనుల తరుపున తౌడమ్మ మాట్లాడుతూ ఆ భూముల సాగుకు తాము ఎంతో ఖర్చు చేశామన్నారు. అటువంటి భూములను విడిచిపెట్టి మమ్మల్ని దూరంగా పంపడం సమంజసం కాదన్నారు. 30 కుటుంబాలు ఈ భూములు జీవనాధారమన్నారు. ఫలసాయం వచ్చే సమయంలో భూములను లాక్కోవడం అధికారులకు తగదన్నారు.ఏపీఐఐసీ తరపున డీజీఎం జైచంద్ర మాట్లాడుతూ 2017లోనే ప్రభుత్వం నుంచి తాము ఈ భూములను ఏడున్నర కోట్ల రూపాయలకు కొనుగోలు చేశామన్నారు. భూములను తమకు అప్పగించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ అజు రఫీజాన్ మాట్లాడుతూ గతంలోనే కాకర్లవలస గిరిజనులు 28 మందికి రిజర్వు ఫారెస్టు భూముల్లో పట్టాలిచ్చామన్నారు. ఆ భూములు అప్పగిస్తామని స్పష్టం చేశారు. అయితే ఆ భూములతో పాటు నష్టపరిహారం కూడా తమకు చెల్లించాలని, ఒక్కో కుటుంబానికి రూ.8 లక్షలు వంతున నష్టపరిహారం చెల్లించాలని ప్రతిపాదన చేశారు. చర్చల్లో బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు, మిర్తివలస సర్పంచ్ మజ్జి రాంబాబు, సీపీఎం నాయకుడు బలసా శ్రీను తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులతో చర్చిస్తున్న అధికారులు